వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 32
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
అక్టోబర్ 16, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు



- దీపావళి నాటికి సానుకూల నిర్ణయం
- ప్రెస్ అకాడమీ చైర్మన్ సమక్షంలో నిర్ణయం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, జర్నలిస్టు సంఘాలు, సొసైటీల బాధ్యులు

2లో..

## క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్

క్రీడాజ్యోతిని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా



2లో..

# డంపింగ్ యార్డ్‌గా.. శ్మశాన వాటిక





వివరాలు 2లో..

- ముక్కు మూసుకునే కార్యక్రమాలు
- ఇబ్బందులు పడుతున్న పుప్పాల గుట్ట ప్రజలు
- స్పందించని ఆరోగ్యాధికారి
- పట్టించుకోని బల్దియా



బంధువులు, ఆత్మీయులు ఎవరైనా చనిపోతే వారిని కడసారి చూసేందుకు అందరం ఆరాటపడుతాం. అంత్యక్రియలు జరిగే వరకు వారితోనే ఉండి మన భక్తి భావాన్ని చాటుకుంటాం. అయితే 36వ డివిజన్ లోని పుప్పాల గుట్ట శ్మశాన వాటికకు పోవాలంటేనే జనం భయంతో వనికి చస్తున్నారు. డంపింగ్ యార్డ్ గా మారిన శ్మశాన వాటికలో ముక్కు మూసుకుంటే తప్ప అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. చెత్తను రహదారుల పక్కన, ఎక్కడపడితే అక్కడ పోయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలించిన చెత్తను ఇక్కడే గుట్టలుగా డంప్ చేయడంపై స్థానికులు మండి పడుతున్నారు. ఈ విషయంలో చొరువ చూపాల్సిన బల్దియా అధికారులు సైతం చేతులెత్తేయడంపై జనం గగ్గోలు పెడుతున్నారు. చెత్తను డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలంటూ బల్దియా ఆరోగ్య అధికారికి స్థానికులు పలుమార్లు ఫోన్ చేసినా ఆయన పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. చెత్తను తొలగించాలంటూ ఎవరైనా ఫోన్ చేస్తే వారిపైనే ఆరోగ్య అధికారి చిందులు వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి పుప్పాలగుట్ట శ్మశాన వాటికలో డంప్ చేసిన చెత్తను తొలగించడంతోపాటు అక్కడ చెత్త పోయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

## ఎల్ఆర్ఎస్ లో వార్డు ఆఫీసర్ల పాత్ర కీలకం

- నగర మేయర్ గుండు సుధారాణి
- దరఖాస్తుల నిర్వహణపై వార్డు ఆఫీసర్లకు శిక్షణ



8లో..

## సమాన పనికి సమాన వేతనం



8లో..

## మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలి



8లో..

- జాతర అభివృద్ధికి కృషి
- దేవాదాయ శాఖ మంత్రి సురేఖ
- కుటుంబ సభ్యులతో వనదేవతల సందర్శన



# డంపింగ్ యార్డ్ గా.. శ్మశాన వాటిక

- ముక్కు మూసుకునే కార్యక్రమాలు
- ఇబ్బందులు పడుతున్న పుప్పాల గుట్ట ప్రజలు
- స్పందించని ఆరోగ్యాధికారి
- పట్టించుకోని బల్దియా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 36 డివిజన్ పుప్పాల గుట్ట శ్మశాన వాటిక పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. 36వ డివిజన్ తో పాటు చుట్టు పక్కల డివిజన్ల నుంచి ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను నిత్యం శ్మశాన వాటికకు పోవు రహదారికి రెండు వైపులా గుట్టలుగా పోయడంతో ఆ ప్రాంతం దుర్వాసతో కంపు కొడుతోంది. దీనికి తోడు పందులు, దోమల స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికే సీజనల్ వ్యాదులతో సతమతమవుతుంటే.. ఈ డంపిగ్ వల్ల వ్యాదులు పెరిగే అవకాశం వుంది. దీంతో మృతి చెందిన తమ వారి అంత్య క్రియల్లో పాల్గొనేందుకు జనం జంకుతున్నారు. ముక్కు మూసుకుంటే తప్పా అక్కడ నిలపడలేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడికి వెళితే లేనిపోని రోగాలు వస్తాయన్న భావనతో అనేకులు దూరంగానే ఉండి అంత్యక్రియలను చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

## స్పందించని అధికారులు..

నగరంలోని వివిధ డివిజన్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్లు, డంపర్ల ద్వారా మడికొండ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా పుప్పాల గుట్ట శ్మశాన వాటిక రహదారికి ఇరువైపుల గుట్టలుగా పోయడం వివాదాలకు దారితీస్తోంది. రహదారుల పక్కన ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను డంప్ చేయకూడదని తెలిసినప్పటికీ శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై స్థానికులు ఎవరైనా బల్దియా ఆరోగ్య అధికారికి ఫోన్ చేస్తే ఆయన సమస్యను పరిష్కరించకుండా ఫోన్ చేసిన వారిపైనే చిందులు వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తనుంచి వస్తున్న దుర్వాసనను తట్టుకోలేక స్థానికులు పలు మార్లు చేసిన సంఘటనలూ ఉన్నాయి.

## చెత్తను తొలగించాలి..

**- ఎల్.శ్రీనివాస్, సామాజిక వేత్త**



రహదారుల పక్కన చెత్త పోయడం నేరం. ఈ విషయంలో గతంలోనే బల్దియా అధికారులు సీరియస్ గా స్పందించారు. రోడ్ల పక్కన డంప్ చేస్తున్న ట్రాక్టర్ సిబ్బందిపై చర్యలు కూడా తీసుకున్నారు. అయినప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా నిత్యం ట్రాక్టర్ల ద్వారా చెత్తను గుట్టలుగా ఇక్కడ డంప్ చేస్తున్నారు. దీనినుంచి వస్తున్న దుర్వాసనతో చుట్టు పక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్మశాన వాటికకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.



# క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్

### క్రీడాజ్యోతిని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

### పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా


**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామీణ స్థాయి నుంచి యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం ఉదయం వరంగల్ కు చేరుకుంది. క్రీడాజ్యోతి ర్యాలీకి వరంగల్ లోని పోచమ్మ మైదానం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, డీసీపీ రవీందర్ ఘన స్వాగతం పలికిన అనంతరం ర్యాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు త్వరలో నిర్వహిస్తున్న సీఎం కప్ గురించి చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మన జిల్లా నుంచి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులు తయారు కావాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మన జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి యువత పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సీఎం కప్ టార్చ్ ర్యాలీ..

పోచమ్మ మైదానం నుంచి ఎంజీఎం మీదుగా హనుమకొండ వేయి స్తంభాల దేవాలయం వరకు ర్యాలీ అట్టహాసంగా సాగింది. ఇందులో సుమారు 800 మంది క్రీడాభిమానులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సీఎం కప్ క్రీడా జ్యోతిని వేయి స్తంభాల దేవాలయం వద్ద హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు రవీందర్, షేక్ సలిమా, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్యాట్రన్ వరద రాజేశ్వర్ రావు, జనరల్ సెక్రెటరీ కైలాష్ యాదవ్, పెట్టా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి రఘువీర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ క్రీడా సంఘ బాధ్యులు, పాఠశాలల పిటి, పిఈటీలు సిబ్బంది, క్రీడాకారులు, యువతీ యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇండ్ల స్థలాల సమస్య కొలిక్కి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై సానుకూలంగా స్పందించడంతో బుధవారం హైదరాబాద్ లోని బీఆర్ కే భవన్ లోని మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. గతంలో సొసైటీలకు కేటాయించిన స్థలాలతో పాటు మరికొంత స్థలాన్ని సేకరించి అర్హులైన జర్నలిస్టులకు అందరికీ నివేశన స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. అన్నీ కలిసి వస్తే దీపావళి పండుగ నాటికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై సానుకూల నిర్ణయం వెలువడగలదని, వివిధ యూనియన్ ల నాయకులు, సొసైటీల బాధ్యులు, సిక్స్ మెన్ కమిటీ సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి సహకరించాలని



సూచించారు. అలాగే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం అదనపు భూమి కోసం ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లి భూమిని కేటాయించేందుకు కృషి చేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్ ల, హౌసింగ్ సొసైటీల, సిక్స్ మెన్ కమిటీ బాధ్యులు వల్లాల వెంకట రమణ, సీహెచ్ సుధాకర్, బీఆర్ లెనిన్, పిన్నా శివకుమార్, కక్కెర్ల అనిల్ కుమార్ గౌడ్, బొక్క దయాసాగర్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, మస్కపురి సుధాకర్, బొల్లారపు సదయ్య, ఎం.రాజేంద్ర ప్రసాద్, సోమ నర్సయ్య, పి.వేణు మాదవ్, పీవీ.మదన్ మోహన్, దుర్గా ప్రసాద్, కొండం రవీందర్ రెడ్డి, ఎస్. భాస్కర్ రావు, ఎం.రవీందర్ రావు, వసంత్, వహీద్ గుల్షన్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాలనుంచి దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నెహ్రూ యువ కేంద్ర వరంగల్ (ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర, యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలలోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హనుమకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870– 2958776 సంప్రదించాలని సూచించారు.

## కుల వృత్తులను ప్రోత్సహించడమే ధ్యేయం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కుల వృత్తులను ప్రోత్సహించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన వారందరికీ సేఫ్టీ కిట్స్ ను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 104 మంది గీత కార్మికులకు రూ.12 లక్షల 48 వేల విలువ చేసే కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అరకొరగా గొర్రెలు, గేదెలు పంపిణీ చేసి కులవృత్తులను పట్టించుకోలేదని విమర్శించారు. తాటి, ఈత చెట్లు ఎక్కే క్రమంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఈ సేఫ్టీ కిట్లలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 6 పరికరాలతో కూడిన తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ లతో రూ.12 వేల రూపాయల విలువ గల కాటమయ్య కిట్లు గీత కార్మికులు సద్వినియోగం చేసుకొని ప్రమాదాలను నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్, ఎక్సైజ్ పోలీస్ సూపరింటెండెంట్ కిరణ్, సీఐ చిరంజీవి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహ స్వామి, గీత కార్మికుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఎంజీఎం హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్



**వరంగల్ వాయిస్, ఎంజీఎం సెంటర్ :** హసన్ పర్తి గ్రామానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గత 10 సంవత్సరాల నుంచి థైరాయిడ్ గడ్డ గొంతు నొప్పితో బాధ పడుతుంది. ఆహారం మింగలేక పోతుంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోవడంతో డాక్టర్స్ ఆపరేషన్ చేయించు కోక తప్పదని సలహా ఇచ్చారు. వరలక్ష్మికి థైరాయిడ్ గడ్డ 25సెంటిమీటర్ల వెడల్పుగా ఉండి మెడ మొత్తాన్ని ఆక్రమించి మెదడుకు రక్త ప్రసారం చేసే రక్త నరాలను చుట్టు ముట్టడంతో ఎన్ని ప్రైవేట్ హాస్పిట్సల్ తిరిగినా, చివరికి హైదరాబాద్ లో కూడా ప్రాణహాని, గొంతు పడిపోయే అవకాశం ఉందని ప్రైవేటు డాక్టర్లు చేతులు ఎత్తేశారు. అయితే ఎంజీఎంలో సంప్రదించగా ప్రొ.డాక్టర్. శ్రీనివాస్ గౌడ్, డాక్టర్.వినోద్‌కుమార్‌బృందం ఈ అరుదైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఇప్పుడు పేషెంట్ పూర్తి ఫిట్‌నెస్‌గా ఉన్నారని డాక్టర్లు తెలియజేశారు. ఎంజీఎం సూపర్‌డెంట్ చిలక మురళి వైద్య బృందాన్ని అభినందించారు.

## నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికిన పీఆర్టీయూ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** డీఎస్సీ-2024 ద్వారా నియమితులై మరిపెడ మండలానికి విచ్చేసిన నూతన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ మరిపెడ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పీఆర్టీయూ మరిపెడ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీసర రమేష్ రెడ్డి, లింగాల మహేష్ గౌడ్ లు మాట్లాడుతూ నూతనంగా మరిపెడ మండలానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 19మంది, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 07 మంది నియమితులు కావడం జరిగిందన్నారు. వారికి మరిపెడ మండల శాఖ పక్షాన హెల్ప్ డెస్కు ఏర్పాటు చేసి వారికి కావాల్సిన జాయినింగ్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి వారికి పీఆర్టీయూ సభ్యత్వాన్ని అందజేయడం జరిగిందన్నారు. పీఆర్టీయూ బాధ్యులు దోమల లింగయ్య, అబ్బూరి సునీల్, గండి కరుణాకర్, గుర్రం వెంకన్న, గుగులోత్ వెంకన్న, గుండ్ల వెంకన్న, వెంకటయ్య, మంగీలాల్, గుగులోత్ రవి, హరి, కేదారి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలి

### వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో వాపక్ష విద్యార్థి సంఘాలు పీడీఎస్ యూ, ఏఐఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ బీ, పీడీఎస్ యూ విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్ హాకీమ్ నవీనద్, జిల్లా కార్యదర్శి యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ లు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ మెంట్ గత మూడు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని డిగ్రీ కళాశాల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ మూడు సంవత్సరాలుగా విడుదల చేయలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోకుండా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి కళాశాలలో తెరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాలలను తెరిచి విద్యార్థుల చదువులకు సహకరించాలని కోరారు. స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేసేంతవరకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, వేల్పుల చరణ్, కుక్కల కుమార్, సి.పది వినయ్, కుంటి పవన్, నాయకులు కుమార్, పీడీఎస్ యూ జిల్లా నాయకులు వంశీ మోక్షజ్ఞ, యూఎస్ఎఫ్ఐ నాయకులు రాకేష్ పాల్గొన్నారు.

## మన భవిష్యత్తుకై.. అందరికీ పౌష్టికాహారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మన భవిష్యత్తు కోసం అందరికీ పౌష్టిక ఆహారం అనే అంశంపై అవగాహన కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మనం తినే ఆహారాన్ని వృథా చేయకుండా అందరికీ లభించే విధంగా ఆహార పొదుపుపై అవగాహన పెంచుకోవాలని, లేకుంటే ఆకలి చావులతో అలమటిస్తామన్నారు. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాలలో 20 నుంచి 30 శాతం ఆహారం వృథా అవుతుందని, దీనిని అరికట్టవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ ఒక్కరూ ఆహారం లేక చనిపోవద్దని" ఆకలిని నిర్మూలిద్దాం.. ఆహార భద్రతను సాధిద్దాం "అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ భుజంగ రెడ్డి, కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి ముందుగా అన్నం పెట్టండి.. ఆ తర్వాత అభివృద్ధి చెందుదాం ఈ లక్ష్యంతో ఆహార వృథాను అరికడుతామని పిలుపునిచ్చారు. 2030 లోపల ఏ ఒక్కరికి ఆహారం దొరకకుండా ఉండకూడదని చైతన్యపరిచి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. రతన్ సింగ్ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.వాసుదేవులు, డాక్టర్ శ్రీధర్, చండీశ్వర్, జి.శ్రీనివాస్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష పాడ్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, శివనగర్ :** గంగిశెట్టి మధుర అమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు ట్రస్ట్ సభ్యులు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం వారి సోదరుడు గంగిశెట్టి జగదీశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శివనగర్ లో 9, 10వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ పరీక్షలకు గాను ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ వరంగల్ పట్టణంలోని 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులందరికీ తమ ట్రస్ట్ ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను అందరికీ అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గండే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను కొనియాడారు. హుజురాబాద్ ప్రాంతానికి చెందిన జగదీశ్వర్ వరంగల్ పట్టణంలో కూడా తమ సేవలను విస్తరించి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సేవనందించడం గొప్ప విషయమన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా తమ కార్యక్రమాలను కొనసాగించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేంద్ర స్వామి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రంగాచారి, సంపత్, నరేందర్, కవిత, సుజాత, జోత్స్న, ప్రకాష్, భవాని, సందీప్, కిరణ్మయి పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న డీఈఓ, ఎంఈఓలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక నక్కలగుట్ట శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంది. ఈనెల అక్టోబర్ 2న రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడం జరిగింది. అవి ఏమీ పట్టించుకోకుండా శ్రీ చైతన్య పాఠశాల ఇష్టారాజ్యంగా స్కూల్ ను నడిపారు. అక్టోబర్ 5న ఏబీవీపీ కార్యకర్తల బృందం, ఎంఈఓతో కలిసి శ్రీ చైతన్య స్కూల్ కు వెళ్లి అక్కడ చూస్తే ఎటువంటి పర్మిషన్స్ లేకుండా గత రెండున్నర సంవత్సరాల నుంచి పాఠశాలను నడుపుతున్నట్లు తేలింది. ఎంఈఓ అది గ్రహించి స్కూల్ ను సీజ్ చేశారు. తర్వాత డీఈఓ, ఎంఈఓల అండదండలతో అదే పాఠశాలను మళ్లీ ఎలాంటి అనుమతులు, బిల్డింగ్ పర్మిషన్స్ లేకుండా నిర్వహిస్తున్నారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి విరుద్ధంగా ఆ స్కూల్ ని నడపడం జరుగుతుంది. ఎంఈఓ, డీఈవోలను దీనిపై అడిగితే వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. శ్రీ చైతన్య మాఫియాకుకు డీఈఓ, ఎంఈఓలు తొత్తులగా మారారని ఏబీవీపీ మండిపడుతోంది. ప్రభుత్వ బడులు బతకాలంటే కార్పొరేట్ పాఠశాల ఆగడాలను అరికట్టాలి కానీ, ప్రభుత్వ అధికారులు ప్రభుత్వానికి విరుద్ధంగా కేవలం కార్పొరేట్ పాఠశాల తొత్తులుగా మారి వారికి నచ్చినట్టుగా కేవలం వారికి బానిసలుగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు ఏబీవీపీ విద్యార్థి నాయకులను బెదిరింపులకు గురిచేస్తుంది. నక్కలగుట్ట శ్రీ చైతన్య కార్పొరేట్ ఆగడాలపై ఏబీవీపీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సుజిత్, నగర కార్యదర్శి అరుణ్, సందీప్, రేవంత్ , కార్తీక్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 16, అక్టోబర్ 2024
www.warangalvoice.net

# పత్తిలో తేమ 18 శాతంగా నిర్ణయించి కొనుగోలు చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పత్తిలో18 శాతం తేమ పెంచాలని రైతు సంఘాల నాయకులు వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7525 గా ప్రకటించారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్లో ముందుగానే వర్షాలు ప్రారంభమై నేటి వరకు కూడా పడుతున్నాయని దీనివల్ల పత్తికి తెగుళ్ళు సోకి దిగుబడి రాక రైతులు పంట నష్టపోయారని పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో సీసీఐ వారు 12 శాతం లోపు తేమ ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు. సీసీఐ అధికారులు మార్కెట్లో పత్తి కొనుగోలు ప్రారంభించక పోవడంతో మార్కెట్ లోని ప్రైవేటు వ్యాపారస్తులు దీనిని ఆసరా చేసుకొని మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతు క్వింటాలుకు రూ.1000 నుంచి 2000 వరకు రైతులు నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు ప్రారంభించాలని సీసీఐ అధికారులను వారు డిమాండ్ చేశారు. పత్తి 18 శాతం వరకు పెంచుటకు కేంద్ర, టెక్స్ టైల్ శాఖ మంత్రికి తమ డిమాండ్ తో కూడిన వినతి పత్రం పంపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ను వారు కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చిన వారిలో సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, సుధమల్ల భాస్కర్, ఆబర్ల రాజన్న, ఐత నగేష్, నున్న అప్పారావులు ఉన్నారు.

## శ్రీ వీరభద్ర స్వామి నీతి చంద్రిక పుస్తకం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర్లు బజార్ లోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో బాణాల వీరయ్య చారి రిటైర్ ఉపాధ్యాయుడు రాసిన శ్రీ వీరభద్ర స్వామి వారి నీతిచంద్రిక పుస్తకాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాణాల వీరయ్య చారి ఉపాధ్యాయ వృత్తిలో రిటైర్ మెంట్ అయి సమాజానికి ఏదో విధంగా మంచి చేయాలనే గొప్ప దృఢ సంకల్పంతో ఈ శ్రీ వీరభద్ర స్వామి నీతిచంద్రిక అనే పుస్తకాన్ని రాయడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ఈ పుస్తకాన్ని రాయడానికి ఎంతో ఓర్పు సహనం కలిగి ఉండాలని, అంతటి గొప్ప పుస్తకాన్ని రచించిన వీరయ్య చారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే శ్రీ వీరభద్ర స్వామి నీతిచంద్రిక పుస్తకాన్ని రచించిన వీరయ్య చారికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ నాయకులు శాంతన్ రాజు, అలాగే వెంకటేశ్వర్లు, బజార్ మాజీ వార్డు మెంబర్ నారాయణ, అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రజా కవులు మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల సమస్యల పరిష్కారం యూటీఎఫ్‌తోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం యూటీఎఫ్ తోనే సాధ్యమని టీఎస్ యూటీఎఫ్ డోర్నకల్ మండల కమిటీ పేర్కొంది. బుధవారం విద్యా వనరుల కేంద్రంలో జరిగిన నూతన ఉపాధ్యాయుల చేరికల సందర్భంగా వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన టీచర్లకు టీఎస్ యూటీఎఫ్ అండగా ఉంటుందన్నారు. రానున్న కాలంలో సీపీఎస్ అంతం చేయడం కోసం అందరూ ఐక్యంగా ఉధృత పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. గతంలో జరిగిన బదిలీలు పదోన్నతులు జరగడానికి యూటీఎఫ్ చేసిన పోరాటాలే కారణమన్నారు. రానున్న రోజుల్లో మెరుగైన పీఆర్సీ కోసం టీఎస్ యూటీఎఫ్ పోరాటాలకు సిద్ధమౌతుందన్నారు. టీచర్లకు ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకొని ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ జి.వివేక్, జిల్లా కమిటీ నాయకులు సాహెబలి, శంకర్, మండల ఉపాధ్యక్షులు గ్రేసమ్మ, అమీన్, సీతారాములు, మీడియా ఇంచార్జి కలపాల అనిత రాములు, భట్టు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే కార్మికుల స్టాఫ్ గ్రీవెన్సిస్ క్యాంప్




**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్ లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ సీనియర్ డీపీఓ ప్రేమ్ కుమార్ లాకవత్ ఆదేశాలమేరకు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ ఇన్ స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేటలో పనిచేస్తున్న మూడు వేల మంది రైల్వే కార్మికుల కోసం ఏపీవో జి.జితేందర్ సమక్షంలో స్టాఫ్ గ్రీవెన్సిస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. దాదాపు 600 మంది పైచిలుకు రైల్వే కార్మికులు ఉమిద్ కార్డ్స్, ఐడీ కార్డ్స్, ప్రమోషన్స్ డ్యూ, సీనియార్టీ లిస్టు, సర్వీస్ రికార్డులో మార్పులు చేర్పులు, ఫ్యామిలీ డిక్లరేషన్ లో మార్పులు చేర్పులు, ఇంకా అనేక సమస్యల పైన వినతులు స్వీకరించారు. అదేవిధంగా మెడికల్ ఉమిద్ కార్డ్స్ అవసరం ఉన్నవారికి ఆన్ లైన్ పద్ధతులలో అక్కడికి అక్కడే కొత్త ఉమిద్ కార్డ్స్ ను కార్మికులకు అందజేశారు. రిటైర్డ్ రైల్వే కార్మికులు వారి సమస్యల పైన ఇచ్చిన వినతులను కూడా స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వెల్ఫేర్ ఇన్ స్పెక్టర్స్ సీహెచ్.సరళ మాధవి, ఎన్ వీవీవీ రెడ్డి, ఎంఎంఎల్. ప్రసాద్, చీఫ్ ఓఎస్ కే.కోటేశ్వర్ రావు, సురేష్ బాబు ఓఎస్, వికాస్ కుమార్ సీనియర్ క్లర్క్, రైల్వే జనరల్ ఇన్ స్టిట్యూట్ సెక్రెటరీ దేవులపల్లి రాఘవేందర్, కోశాధికారి గిరిమెట్ల రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు దారావత్ రఘు, సందే ప్రవీణ్, ప్రశాంత్, రవికిరణ్, రైల్వే కార్మికులు ఎండీ యాకుబ్ పాషా, ఓబీసీ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడు రేండ్ల రమేష్, తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కొండ్ర నరసింహారావు, మజ్దూర్ యూనియన్ నాయకులు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



**వరంగల్ వాయిస్, నెక్కొండ :** వరంగల్ టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు అక్రమంగా పీడీఎస్ బియ్యం సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు నెక్కొండ పోలీసులు సంయుక్తంగా కలిసి అప్పల్‌రావుపేటకు చెందిన కనకదుర్గ రైస్‌మిల్ యజమాని పేరు గోన్ ఆనందం నుంచి 08 ద్విచక్ర వాహనాల టీవీఎస్ ఎక్సెల్ నుంచి లోడ్ అవుతున్న సుమారు మొత్తం 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నెక్కొండ మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు రవాణా చేసి అక్రమంగా లబ్ధి పొందుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తులను, 8 మంది ద్విచక్ర వాహనదారులను తదుపరి చర్యల నిమిత్తం నెక్కొండ పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ జి.బాబు లాల్, టాస్క్ ఫోర్స్ టీం నెక్కొండ పోలీసులు పాల్గొన్నారు.

## 30న నరకాసుర వధకు ఏర్పాట్లు చేయిస్తా

### మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దీపావళి సందర్భంగా ఈనెల 30న ఉర్సు గుట్ట వద్ద జరుగు నరకాసుర వధ ఉత్సవాలకు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజలు వీక్షించటానికి తగు సదుపాయాలు ఏర్పాటు చేయిస్తానని మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో మహానగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఛాంబర్ లో మేయర్ గుండు సుధారాణికి వినతిపత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం నరకాసుర వధ ఉత్సవాలకు రాను రాను ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందున సదుపాయాలు పెంచమని అధ్యక్షుడు మరుపల్ల రవి మేయర్ గుండు సుధారాణిని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నరకాసుర ఉత్సవ కమిటీ సహాయ కార్యదర్శి అవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్లు దూడ కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండే రాజు, సభ్యులు మరుపల్ల శివ, తౌటం నరసింహ, గౌడ రాము, కొమ్ము రాజు, కుండే కుమార్, లు ఉన్నారు.

## 28న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయండి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 28న హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. ఈసదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ రాష్ట్ర నాయకులు యన్.బాల మల్లేష్, తదితర ప్రముఖులు పాల్గొంటున్నారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ,రాజకీయంగా విద్యా వైద్య రంగాలన్నింటిలో వెనుకబడిన, అన్యాయాలకు అవమానాలకు గురైన బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర పాలకులు బీసీ సమస్యలపై అవలంభిస్తున్న విధానాలు, దేశ జన గణనలో కుల గణన, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు ,స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్ల పెంపు మొదలైన అంశాలపై సదస్సులో చర్చించబడతాయన్నారు. సమస్యల సాధనకై తగిన కార్యాచరణ ప్రణాళిక సదస్సులో రూపొందించబడుతుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి బీసీ ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి

### ఆరేగంటి నాగరాజు గౌడ్



**వరంగల్ వాయిస్, కేయూ :** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నాగరాజు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ కళాశాలలో కానీ ప్రైవేట్ కళాశాలలో కానీ విద్యార్థులు చదువు పూర్తిచేసుకుని సర్టిఫికెట్ల కోసమని పోతే ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ పడని విద్యార్థులు వారు ఫీజులు కడితే తప్ప వారికి సర్టిఫికెట్ ఇవ్వమని చెప్పి విద్యార్థులను అనేక రకాలుగా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కాబట్టి, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ రూ.7500 కోట్లను విడుదల చేసి విద్యార్థుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబడాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యచరణ తీసుకొని మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని హెచ్చరించారు.

## విధుల్లో చేరిన నూతన టీచర్లు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు బుధవారం చేరారు. డోర్నకల్ మండలానికి 25 మంది నూతన ఉపాధ్యాయుల వివిధ ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఇందులో 18 మంది ఎజ్జీటీలు, ముగ్గురు తెలుగు పండిట్లు, ఒక హిందీ పండిట్, ఒక ఫిజికల్ సైన్స్, ఒక బయో సైన్స్, ఒక స్పెషల్ ఎడ్యూకేషన్ టీచర్లు విధుల్లో చేరారు. ఉపాధ్యాయ పోటీ పరీక్షలో వేల మందిని దాటుకుని బోధనను వృత్తిగా చేపట్టనున్న కొత్త ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారుల నుంచి అక్టోబరు 15న కొలువు పత్రాలను అందుకున్నారు. నిజానికి, అక్టోబర్ 15 ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా. సాంకేతిక కారణాలతో ఆలస్యమై మధ్యాహ్నం రెండు గంటలకు మొదలైంది. దీంతో ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

## క్రీడల పోటీలను ప్రారంభించిన కమాండెంట్



**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగవ బెటాలియన్ లో ఇంటర్ కాయ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ శ్రీ బి. రామ్ ప్రకాష్ శాంతికపోతాలను ఎగురవేసి క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మన జీవన శైలిలో ముఖ్యమైన భాగమన్నారు. ఇవి శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానసిక శక్తి, ధైర్యం, క్రమశిక్షణను పెంచే ప్రధాన సాధనంగా ఉపయోగపడతాయని అలాగే గెలుపు లేదా ఓటమి కేవలం ఫలితాలు మాత్రమేనన్నారు. నిజమైన గెలుపు మన శ్రమలో, పట్టుదలలో, పోరాట స్ఫూర్తిలో ఉంటుందని అన్నారు. అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు శోభన్, రవి, కిరణ్, సర్వర్, రాజిరెడ్డి, చంద్రన్న, రమేష్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సెమినార్‌కు ఎంపికైన ప్రశాంత్



**వరంగల్ వాయిస్, కేయూ :** రాజస్థాన్ లో జరిగే ఇండియన్ పొలిటికల్ సైన్స్ అంతర్జాతీయ సెమినార్ కు పొలిటికల్ సైన్స్ పరిశోధక విద్యార్థి కళ్లేపల్లి ప్రశాంత్ ఎంపికయ్యారు. “61వ ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ కాన్ఫరెన్స్, అంతర్జాతీయ సెమినార్ “లో భారత దేశంలో మారుతున్న ప్రజాస్వామ్యం, రాజకీయ అవకాశాల పరిమితులు “ అనే అంశం మీద పరిశోధన పత్రాన్ని సమర్పించడం జరుగుతుందని పరిశోధక విద్యార్థి కళ్లేపల్లి ప్రశాంత్ ఈ సందర్భంగా తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని బికనీర్ లో గల మహారాజా గంగా సింగ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 18, 19 తేదీలలో షెడ్యూ ల్ చేయబడిన ‘విక్షిత్ భారత్ ఏ 2047’ అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో భారత దేశంలో ప్రజాస్వామ్య పోకడలు, ప్రజల భాగస్వామ్యం, ప్రజాస్వామ్య సంస్థల పని తీరు, భారత ప్రజాస్వామ్య స్థితిగతులను మానవ హక్కులు పత్రిక స్వేచ్ఛ, శాసన వ్యవస్థ పని తీరు, ప్రజాస్వామ్య అసంతృప్తులు, వివిధ వర్గాల రాజకీయ భాగస్వామ్యం, అల్ప సంఖ్యాకులను రాజకీయాలకు దూరం చేయడం వంటి అనేక అంశాల మీద పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ పరిశోధన పత్రం గత పది సంవత్సరాల్లో భారత రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య పరిరక్షణలో వాటి పాత్రను విమర్శనాత్మకంగా వివరించడం జరిగిందని, ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థ స్థితిగతులను ప్రతిబింబించేలా ఉందని ప్రొఫెసర్ వి.రాంచంద్రం అభినందించారు. అలాగే రాజనీతి శాస్త్ర విభాగపు అధ్యాపకులు, సహ పరిశోధకలు అభినందించారు.

## బ్యాక్‌లాగ్ పేపర్ల క్లియర్‌కు అనుమతి

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ,పి.జి బ్యాక్ లాగ్ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి బ్యాక్‌లాగ్ పేపర్లను క్లియర్ చేయడానికి ఒక సారి అనుమతి ఇస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ప్రాసెసింగ్ ఫీజు, పరీక్షా ఫీజుకు సంబంధించి మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ చూడవచ్చని, ఆయన అందులో పేర్కొన్నారు.

# విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యత సాధించాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయాలని, పల్లెల నుంచి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీ జిల్లా కేంద్రం చేరుకుంది. మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ, డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, స్వాగతం పలికి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించబోతున్న సీఎం కప్ 2024 పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కల్పించే ఉద్దేశంతో ఈ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి,నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్,కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా, కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, ములుగు భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారని, జిల్లాలో మహబూబాబాద్, నెల్లికుదురు, తొర్రూరు నుంచి జనగామకు వెళ్తుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ యువత క్రీడల్లో వారి సత్తాను చాటాలని అందుకు ముఖ్యమంత్రి కప్ మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కప్ నోడల్ ఆఫీసర్ ఇన్ స్పెక్టర్ కన్నం మధు, జిల్లా స్పోర్ట్స్ అధికారి అనిల్, గోకుల్, రతన్ కుమార్ బోస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్, జిల్లా అధికారులు కలెక్టరేట్ లోని అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింర్స్ మెంట్, స్కాలర్ షిప్ లను తక్షణమే విడుదల చేయాలని, విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ పేజీ కళాశాలలు ఈ నెల 14 నుండి రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలో నిర్వదిక బందును పిలుపునివ్వడం జరిగింది, దీనివల్ల విద్యార్థుల తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రూ.6000 కోట్ల పైచిలుకు పెండింగ్ లో ఉన్న రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ బీ, పీడీఎస్ యూ, విద్యార్థి సంఘాల బాధ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తమ్మెర భవన్ లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐఎస్ బీ జిల్లా కో-కన్వీనర్ పెండ్యాల సతీష్, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి ఎండీ మిషన్ సుల్తానాలు మాట్లాడుతూ నాన్ ప్రొఫెషనల్ 2000 కోట్లు ప్రొఫెషనల్ 4000 కోట్లు గాను పెండింగ్ ఉపకార వేతనాల బకాయిలు ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ స్కాలర్షిప్స్ ను విడుదల చేయకపోవడంతో ఈ నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెబుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వాలు మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పెండింగ్ స్కాలర్ షిప్, రీయింబర్స్ మెంట్ ను తక్షణమే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## పెరుమండ్ల రామకృష్ణకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

### డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు నామమాత్రపు ఫీజులతో పాటు నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యాన్ని అందిస్తూ పేదల డాక్టర్ గా పేరుగాంచిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డిపార్ట్ మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ నామినేట్ పదవిని ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణ ట్రస్ట్, కే మ్యాక్స్ సంస్థ ద్వారా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గత పది సంవత్సరాలుగా విద్య, వైద్య, ఆర్థిక రంగాలలో పేదలకు చేయూతనందిస్తూ వారి పురోగతికి కృషి చేస్తున్నారని తెలిపారు. గత శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఆయనకు సముచిత స్థానాన్ని కల్పించినట్లయితే పేదలకు, ప్రజలకు మరింత సేవ చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఇందుకు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి మోరే రంజిత్ కుమార్, డీబీఎఫ్ జిల్లా నాయకులు మోరే ఐలయ్య, చిలువేరు ఆనందం, పోలేపాక రమేష్, జన్ను సామేలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యాధికారుల ఆకస్మిక తనిఖీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని ఆసుపత్రులలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన వారి వివరాలు, స్కానింగ్ నిర్వహించిన వారి వివరాలు, పూర్తి ఇంటి పేరు, ఇంటి నెంబర్, చిరునామా, మొబైల్ నెంబర్, ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫామ్ ఎఫ్ రికార్డులు సక్రమంగా ఉండాలని ప్రతి నెల 5 లోపల జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి ఖచ్చితంగా పంపించాలని ఆయన పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయకూడదని, ఎంటీపీ నియమాలకు , వ్యతిరేకంగా అబార్షన్లు చేయకూడదన్నారు. అలాగే సాధారణ ప్రసవాల రేటు పెంచాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రులలో పిల్లల మరణాలు, మాతృ మరణాలు సంభవించినట్లైతే వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి సాధారణ ప్రసవం గురించి ముందు నుండే సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 16, అక్టోబర్ 2024
www.warangalvoice.net

# ఎస్ఐ చొరవతో సొంత గ్రామానికి చేరుకున్న కుటుంబం

## పోలీసుల ఆధ్వర్యంలో వదిలిపెట్టిన భూమి సాగు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీగా ఉండే పోలీసులు సైతం ఇటీవల కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక చొరవ తీసుకుంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అదే కోవలో ములుగు జిల్లా వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ మండల ప్రజల మన్ననలు పొందుతున్నారు. వెంకటాపూర్ మండలం పెరుకపల్లి గ్రామంలో గాజబోయిన సమయ్య అనే రైతు కుటుంబంతో సహా జీవనం కొనసాగించేవాడు. తనకు ఉన్న 12 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో అదే పెరుకపల్లి గ్రామానికి చెందిన మాదం శివ అనే యువకుడు సమయ్య కుటుంబాన్ని అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టడం మొదలుపెట్టాడు. పలుమార్లు గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ పెట్టినప్పటికి శివ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. అంతటితో ఆగకుండా శివ అనే యువకుడు సమ్మయ్య కుటుంబానికి రోజు రోజుకు మన:శాంతి లేకుండా చేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో శివ వేధింపులు తట్టుకోలేక గత నాలుగు సంవత్సరాల క్రితం సమ్మయ్య తన 12ఎకరాల భూమి, ఇల్లు సైతం వదిలి పెట్టి రాత్రి రాత్రికి కుటుంబంతో సహా రేగొండ మండలం పోచంపల్లి గ్రామానికి వెళ్లిపోయాడు. గత కొంతకాలంగా అక్కడ కుటుంబంతో సహా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో పెరుకపల్లి కి చెందిన ఓ మహిళ పట్ల మాదం శివ అసభ్యకరంగా ప్రవర్తించి జైలు పాలయ్యాడు. ఈ క్రమంలో వెంకటాపూర్ ఎస్ఐ సతీష్ మాదం శివ గురించి ఆరా తీయగా సమ్మయ్య కుటుంబం గురించి తెలిసింది. వెంటనే ఎస్ఐ సతీష్ సమ్మయ్య కుటుంబాన్ని పిలిపించి మాట్లాడి నేనున్నా అని భరోసా కల్పించారు. దీంతో సమ్మయ్య కుటుంబం గత రెండు రోజుల క్రితం సొంత గ్రామమైన పెరుకపల్లి గ్రామానికి చేరుకుంది. కాగా, ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ బుధవారం గ్రామానికి చేరుకొని సమ్మయ్య కుటుంబంతో మాట్లాడారు. అనంతరం ఎస్ఐ సతీష్ సహకారంతో సమ్మయ్య కుటుంబం సభ్యులు గతంలో వారు వదిలిపెట్టి వెళ్లిన తమ 12 ఎకరాల భూమి వద్దకు చేరుకొని పోలీసుల సమక్షంలో భూమిని ట్రాక్టర్ తో సాగుచేయడం ప్రారంభించారు. దీంతో వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ ను గ్రామస్తులు, మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. అదేవిధంగా బాధిత కుటుంబం సైతం ఎస్ఐ సతీష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయటంతో పాటు సొంత గ్రామానికి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా ఎస్ఐ సతీష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేసున్నారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రైతులు క్షేమంగా ఉండాలి.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు రూ. 500 బోనస్ ప్రకటించిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. లింగాల ఘనపూర్ మండలం వనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న వడ్లకు మార్కెట్ ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు దీని కోసం రూ.25 వేల కోట్ల నిధులను సమాకూర్చినట్లు తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులు ఎన్ని క్వింటాలు పండించిన రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డు రకం, సన్న రకం వడ్లను వేరు వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు రెండు, మూడు రోజులలో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, గురుకులాలకు సన్న బియ్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సన్న వడ్లకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలలలోనే 18వేల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు, మరో 3, 4 నెలలలో మరో 12వేల కోట్ల రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలు మాట్లాడాలని సూచించారు. 43 లక్షల మంది రైతులకు 31వేల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అర్హులైన రైతులందరికి రుణ మాఫీ జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళల ద్వారా నిర్వహించాలనే ఐకేపీలకు కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే నాదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్ టాటా అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆద్వర్యంలో అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్ లాల్ అధ్యక్షతన దివంగత రతన్ టాటా సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు మాట్లాడుతూ రతన్ టాటా సమాజానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వ్యాపార రంగంలో టాటా సంస్థలను సుస్థిర స్థానానికి తీసుకు రావడంతో పాటు సమాజానికి విస్తృత సేవలు అందించిన గొప్ప మానవతా వాధి అని కొనియాడారు. సామాజిక స్పృహ కలిగిన రతన్ టాటా ఎంతో మంది కష్ట జీవులకు నేనున్నానంటూ ఆపన్న హస్తాలు అందించి దాతృత్వం చాటుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. దివంగత రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాల్సిన అచసరం ఎంతైనా ఉందని భారత ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్ రావు, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ కె.అనితా రెడ్డి, కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, సంస్థ బాధ్యులు ఆచార్య కొక్కొండ విజయబాబు, శనిగరపు రాజమోహన్, కాజీపేట పురుషోత్తం, ఆచార్య జి.నరసింహమూర్తి, విప్పనపల్లి రవికుమార్, డాక్టర్ అనసూరి చంద్రమౌళి, వెలాంగిణి, ఆచార్య వెలుదొండి రవికుమార్, అశోక్, రావులకొలను రామమూర్తి, లక్ష్మినారాయణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దళితులను కాంగ్రెస్ అభివృద్ధి చేస్తోంది

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో జిల్లా ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, నాయకులు కలిసి ఆర్టీఏ ఆక్ట్ కింద ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో దళితులు ఎక్కువగా పాల్గొని ప్రాణాలు కోల్పోయి కేసుల పాలై వికలాంగులై అన్ని రకాలుగా ఉద్యోగాలు రాక వెనుకబాటుకు గురయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ గా నేను చాలాసార్లు గడిచిన ప్రభుత్వంలో విన్నవించుకోవడం జరిగింది. కానీ, ఏ ఒక్క సంక్షేమ పథకం దళిత ఉద్యమకారులకు అందలేదు. జిల్లాలో దళిత సామాజిక వర్గం ఎక్కువగా ఉంది. కానీ గత ప్రభుత్వంలో దళితులు అన్ని రకాలుగా వెనుక వెనుకబాటుకు గురయ్యారు. వారిని రకరకాల ఇబ్బందులు పెట్టి శారీరకంగా మానసికంగా భూముల విషయంలో దళిత మహిళల విషయంలో అడుగడుగునా అన్యాయానికి గురయ్యారు. అన్యాయానికి గురైన వారు ప్రశ్నిస్తే వారిపైన అక్రమ కేసులు బనాయించారు. ఎస్సీ, ఎస్టీలు కమిషనరేట్ పరిధిలో ఎన్ని కేసులు పెట్టారో, ఎన్ని కేసులు నమోదయ్యాయో వాటి ప్రస్తుత పరిస్థితి ఏ విధంగా ఉందో, వారిని ఏ విధంగా ఆదుకోవాలనే దిశగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ఆదేశానుసారం వివరాలు కోరడం జరిగిందని రామకృష్ణ తెలిపారు. వాటి ఆధారంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని, వారందరినీ తప్పకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆదుకుంటుందని డాక్టర్ రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ ఆరూరి సాంబయ్య, భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు కిరణ్, కాజీపేట మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

# నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అమలులోకి వచ్చిన నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, పోలీస్, విద్య, విద్యుత్, రవాణా, ఎక్సైజ్, పౌర సరఫరాలు, మైనింగ్, యాంటీ నార్కోటిక్స్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల ఉన్నతాదికారులతో భారతీయ నూతన న్యాయ చట్టాలు, ఎన్ ఫోర్స్ మెంట్, రోడ్డు భద్రత అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలపై దృష్టి సారించేందుకు మండల, జిల్లాస్థాయిలో అధికారులు సమన్వయ సమావేశాలను నిర్వహించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నూతనంగా న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయని అన్నారు. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలవుతున్నాయని అన్నారు. నూతన న్యాయ చట్టాలపై పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, తీసుకుంటున్న చర్యలపై వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వోవైవీ.గణేష్, డీసీపీసలీమా, డీఈఓ వాసంతి, డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె.నారాయణ, ఏసీపీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పబ్లిసిటీ కోసమే..

- సుశాంత్ ఇంటిని కొనేసిన ఆదాశర్మ
- బాలీవుడ్ లో నెటిజన్ల విమర్శలు
- విమర్శలను తోసిపుచ్చిన నటి





బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని నటి అదాశర్మ కొనుగోలు చేసిన తరవాత ఆ ఇంటిని రీమోడలింగ్ చేసి ఇటీవలే కుటుంబంతో సహా అక్కడికి షిఫ్ట్ అయ్యారు. అయితే.. ఆమె పబ్లిసిటీ కోసమే ఇలా చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా వీటిపై అదా స్పందించారు. ఒక నటిగా తనకు చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ఇలాంటివాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ఆ ఇంటిని ఉద్దేశించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'మన జీవితంలో చేయాల్సిన పనులు చాలా ఉంటాయి. అభిప్రాయాలు తెలపడానికి మన దేశంలో పూర్తి హక్కు ఉంటుంది. నేను ఈ ఇంటిని కొనుగోలు చేయడంపై కూడా ఎవరి అభిప్రాయాలు వాళ్లు వెల్లడిరచారు. 'నేను మంచి వ్యక్తిని' అని రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదు. నాకు చేయాలనిపించినది నేను చేశా. నా కోసం ఎవరూ మారకూడదని నేను అనుకుంటాను. అదే రూల్ ఇతరులకు వర్తిస్తుంది. వారి కోసం నేను నా పద్ధతిని మార్చుకోను' అని చెప్పారు. ఇక సుశాంత్ ఇంటి గురించి మాట్లాడుతూ.. 'నాకు ఈ ఇల్లు ఎంతో నచ్చింది. మా అమ్మ, అమ్మమ్మతో కలిసి ఇక్కడ ఉంటున్నాను. ఈ ఇంట్లో ఏదో తెలియని శక్తి ఉంది' అని తెలిపారు. గతంలోనూ ఈ ఇంటిపై అదా ఇలాంటి కామెంట్సే చేశారు. సుశాంత్ ఇంటిని చూడగానే తనకు ఎంతో పాజిటివ్‌గా అనిపించిందన్నారు. అందుకే కొన్నట్లు వెల్లడిరచారు. మొత్తం రీమోడలింగ్ చేశానన్నారు. మొదటి అంతస్తుని గుడిలా మార్చేసినట్లు చెప్పారు. ఒక గదిని మ్యూజిక్ రూమ్‌గా, మరో దాన్ని డ్యాన్స్ స్టూడియోగా చేశానన్నారు. టెర్రస్ మొత్తం గార్డెన్ లా మార్చేసినట్లు తెలిపారు. నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020 జూన్ 14న ఆత్మహత్య చేసుకున్నారు. తన నివాసంలోనే ఉరి వేసుకున్నారు. సినిమాల్లో అవకాశాలు లేకపోవడం, వ్యక్తిగత కారణాల వల్ల మానసిక కుంగుబాటుకు గురి కావడంతోనే ఆయన మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఇప్పుడు అదే ఇంటిని అదా కొనుగోలు చేసి అందులోకి షిఫ్ట్ కావడంతో బాలీవుడ్‌లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.



## ఆ అనుభవమే మంచి పేరు తెచ్చింది

దర్శకుడి ప్రతిభ అంటున్న నటి నిఖిలా విమల్ తాను ఒక పరికరాన్ని మాత్రమేనని, దర్శకుడు తనకు నచ్చిన రీతిలో మలచుకున్నారని హీరోయిన్ నిఖిలా విమల్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఆయన స్వీయ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'వాళై'ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో పూంగొడి టీచర్‌గా కీలక పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన నిఖిలా విమల్ చిత్రంలో నటించిన తన అనుభవం, పూంగొడి టీచర్ పాత్రను దర్శకుడు మలిచిన తీరు వర్ణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'వాళై' సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప విషయం. ఆ పాత్రకు తగినట్టుగా దర్శకుడు నన్ను మలుచు కున్నారన్నారు. నేను ఒక పరికరాన్ని మాత్రమే. 'కర్ణన్' చిత్రంలో హీరోయిన్ రజీషా విజయన్ పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి చెన్నైకి రాగా ఆ సమయంలోనే 'వాళై'చిత్రం గురించి దర్శకుడు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం చిత్రాన్ని నిర్మించి, అందులో నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్రను ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటాను' అని పేర్కొన్నారు.



## ఇడ్లీ కొట్టుతో వస్తోన్న నిత్యామీనన్



ఎంచుకునే ప్రతి పాత్రలోనూ తన సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార నిత్యామేనన్. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఈమె.. తమిళ కథానాయకుడు ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై'(ఇడ్లీ కొట్టు) అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. 'కొత్త ప్రకటన.. కొత్త ప్రయాణం... 'ఇడ్లీకడై' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది నిత్య. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైనట్లు చిత్రవర్గాలు తెలిపాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ధనుష్ తెరకెక్కిస్తున్నారు. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే తదితరులు నటిస్తున్నారు. 'తిరు' చిత్రంలో స్నేహితులుగా కనిపించి అభిమానుల్ని అలరించిన ధనుష్, నిత్య.. మరి ఈసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## సందీప్ కిషన్ హీరోగా మజాకా



ఈ మధ్యన రవితేజ వరుస చిత్రాలు విడుదలైనా ఏదీ సరిగ్గా విజయం సాధించలేదు. 'ధమాకా' ఒక్కటే హిట్‌గా నిలిచి వంద కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన నక్కిన త్రినాథరావు పై టాలీవుడ్‌లో హీరోలకు నమ్మకం పెరిగింది. ఇప్పుడు ఆయన 'మజాకా' సినిమా తీస్తున్నారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'మజాకా' తరవాత నక్కిన త్రినాథరావు రవితేజతో ఓ మరో సినిమా చేయబోతున్నట్టు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. అందుకు సంబంధించిన కథ కూడా సిద్ధం చేసుకొన్నట్టు సమాచారం. 'ధమా?కా' విడుదలైన వెంటనే నక్కిన త్రినాథరావుతో మరో సినిమా చేయడానికి రవితేజ ఆసక్తి చూపించారు. అయితే.. రవితేజ చేతిలో అప్పటికే చాలా సినిమాలున్నాయి. మరోవైపు నక్కిన త్రినాథరావు కూడా వేరే నిర్మాతల దగ్గర అడ్వాన్సు తీసుకొన్నారు. అందుకే రవితేజతో సినిమా కాస్త ఆలస్యమైంది. అయితే 'మజాకా' పూర్తయిన వెంటనే రవితేజతో సినిమా ఉండబోతోందని ఇన్ సైడ్ వర్గాలు నుంచి సమాచారం. 'ధమాకా' సమయంలోనే రవితేజకు మరో లైన్ చెప్పి 'ఓకే' చేయించుకొన్నాడు నక్కిన. 'మజాకా' పనులు ఓ వైపు జరుగుతున్నా, మరో రైటింగ్ టీమ్ తో రవితేజ కథపై చర్చలు జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ తరవాత నక్కిన సినిమా పట్టాలెక్కుతుంది. ఈలోగా నక్కిన 'మజాకా' కూడా వచ్చేస్తుంది.

# మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలి

- జాతర అభివృద్ధికి కృషి
- దేవాదాయ శాఖ మంత్రి సురేఖ
- కుటుంబ సభ్యులతో వనదేవతల సందర్శన





**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** గిరిజన ఆరాధ్య దైవం సమ్మక్క–సారక్కల జాతర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. ములుగు జిల్లాలో కొలువైన వనదేవతలను కొండా సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ–కొండా మురళీధర్ రావు దంపతులతో పాటు వారి కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్, మనవడు శ్రీయాన్ష్ మురళీకృష్ణతో కలిసి అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించారు. తమ మనవడి తలనీలాలు సమర్పించిన అనంతరం సమ్మక్క సారక్కల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క పూజారులు మంత్రికి అమ్మవార్ల చీరె, పసుపు కుంకుమలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సమ్మక్క సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించే దాకా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదని మంత్రి సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన జాతరను దిగ్విజయవంతంగా చేపట్టిందని గుర్తు చేశారు. దేవాదాయ శాఖ తరపున మంత్రిగా తాను, గిరిజన బిడ్డ, మంత్రి సీతక్క సమ్మక్క సారక్క జాతర ప్రాంత అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. తమ కులదైవమైన సమ్మక్క సారక్కలను ప్రతియేడు దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలనీ, రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు గట్టెక్కాలనీ మంత్రి సురేఖ ప్రార్థించారు. రాష్ట్ర ప్రదాత అయిత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు వనదేవతలు శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి

## ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓంకార్ భవన్ వరంగల్ నుంచి పత్రిక ప్రకటన విడుదల చేశారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ గత మూడు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని డిగ్రీ కళాశాల బంద్ కి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులకు పట్టించుకోకుండా వ్యవహరిస్తుందన్నారు. స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ అనేది ఒక బర్నింగ్ సమస్యగా మారిందన్నారు. డిగ్రీ కళాశాలలు బంధు నిర్వహించడం వల్ల విద్యార్థుల చదువులకి ఆటంకం కలుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి కళాశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాలలను తెరిచి విద్యార్థుల చదువులకు సహకరించాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు పై చదువులకు వెళ్లే అవకాశం కోల్పోతున్నారన్నారు. కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ లను విడుదల చేయాలన్నారు. లేకపోతే వాటిని విడుదల చేసేంతవరకు అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.




# సమాన పనికి సమాన వేతనం

## ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన జీతం ఇవ్వకుండా శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా విమర్శించారు. బుధవారం హైదరాబాద్ కోటిలోని ఎన్ హెచ్ఎం కార్యాలయం ఎందుట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ రకాల క్యాడర్ల ఉద్యోగులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎన్ హెచ్ఎం స్కీములో వివిధ క్యాడర్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కానీ, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ గైడ్లెన్స్ ప్రకారం కానీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చట్టం ఉన్నప్పటికీ అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ విధానం తీసుకువచ్చిన సందర్భంలో ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనాన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు చెల్లించే పద్ధతి ఉన్నదని కానీ గత పది సంవత్సరాలుగా ఆ విధానాలకు తిరోధకాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారం తక్కువ జీతాలతో ఉద్యోగులతో పనులు నిర్వహించుకుంటున్నదని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లాంటి సౌకర్యాలు కల్పించే వరకు పోరాటం నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు సరికొండ సురేష్ గౌడ్, సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి, ప్రవీణ్, రెండో ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల, కోశాధికారి పద్మ, జ్యోతి, డి.కరుణ, కోర్నల్, కృష్ణవేణి, కరుణ, తిరుమలేష్, లక్ష్మి, శ్రీనివాస్, భారతి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఈఓ కృష్ణవేణికి అందజేశారు.

# ఎల్ఆర్ఎస్ లో వార్డు ఆఫీసర్ల పాత్ర కీలకం

- నగర మేయర్ గుండు సుధారాణి
- దరఖాస్తుల నిర్వహణపై వార్డు ఆఫీసర్లకు శిక్షణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్ ) దరఖాస్తుల పరిశీలనలో వార్డు ఆఫీసర్ల పాత్ర కీలకమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం వార్డు ఆఫీసర్ లతో ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్ లకు చెందిన వార్డు అధికారులు క్షేత్ర స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిష్పక్షపాతంగా పారదర్శకంగా పరిశీలన జరపాలన్నారు. ఈ ప్రక్రియ 12 బృందాలచే కొనసాగుతున్నప్పటికీ అనుకున్న స్థాయిలో నిర్వహణ జరగనందున, ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయడానికి వార్డు అధికారులను ఇందులో భాగస్వాములను చేయడం జరుగుతున్నదన్నారు. గ్రేటర్ నగర పరిధిలో సుమారు 80 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలన జరపాల్సి ఉందని ఇందుకోసం ఒక్కో వార్డు అధికారి సుమారు 1,400 దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలని, పరిశీలన వేగవంతంగా జరిగేలా నిత్యం పర్యవేక్షించుటకు పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారులు అధికారులకు సహకరించి పరిశీలన సందర్భంలో సూచించిన ధృవ పత్రాలను అందజేయాలని మేయర్ తెలిపారు. అంతకు ముందు బల్దియా కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వార్డు అధికారులకు దరఖాస్తుల పరిశీలన విధానాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు దృశ్య మాధ్యమం ద్వారా సంపూర్ణంగా వివరించి వార్డ్ ఆఫీసర్లు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, సెక్రెటరీ విజయ లక్ష్మి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, టీపీఎస్ లు ఏర్షాద్, శ్రీకాంత్, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యం చేరాలి..

ట్రేడ్ లైసెన్స్ ల జారీ లక్ష్యాన్ని సాధించాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పారిశుద్ధ్యం, పన్నుల సేకరణ, పారిశుద్ధ్య వాహనాల స్థితిగతులు తదితర అంశాలపై అధికారులతో బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, ఇంటింటి నుంచి తడి పొడి చెత్త వేరువేరుగా విధిగా సేకరించడంతో పాటు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఇంటి యజమాని సంతకం లాగ్ బుక్ లో ఖచ్చితంగా తీసుకునేలా సానిటరీ ఇన్స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. వరుసగా మూడు రోజులు తడి పొడి చెత్త అందించని ఇంటి యజమానికి పెనాల్టీలు వెయ్యాలన్నారు. చికెన్ మటన్, ఫిష్ వేస్టులు మురుగు కాలువలలో వేసేవారిపై పెనాల్టీలు వేస్తూ క్రమబద్ధంగా సేకరించిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఎంహెచ్ డాక్టర్ రాజిరెడ్డి, ఏంహెచ్ఓ డాక్టర్ రాజేష్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, సానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com